సాక్షి చిత్తూరు

శుక్రవారం । 12 । మే । 2023

I



తొలిరోజే విద్యాకానుక

జిల్లావ్యాప్తంగా పాఠశాలలు పున: ప్రారంభమైన రోజే జగనన్న విద్యాకానుక కిట్లను పంపిణీ చేయాలని కలెక్టర్ షణ్మోహన్ ఆదేశించారు. -IIలో



జాతరకు వేళాయె..

చిత్తూరులో గంగజాతర సంబరం మొదలైంది. ఈ నెల 16, 17 తేదీల్లో జరిగే జాతర ఏర్పాట్లను నిర్వాహకులు ముమ్మరం చేశారు. -IIలో

	గరిష్ఠం	కనిష్ఠం
చిత్తూరు	39	27
తిరుపతి	39	27
తిరుమల	36	23
గూడూరు	43	29
నగరి	41	28

న్యూస్‌రీల్

చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రం ప్రారంభోత్సవంలో కలెక్టర్ షణ్మోహన్, కమిషనర్ అరుణ

చిత్తూరు రూరల్: చిత్తూరు జిల్లాకేంద్రంలో పాత్రికేయులు ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని కలెక్టర్ షణ్మోహన్ ప్రారంభించారు. చిత్తూరు ప్రెస్‌క్లబ్, ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వేసవి చలివేంద్రాన్ని సోమవారం కలెక్టర్, మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అరుణ ప్రారంభించారు. అనంతరం బస్టాప్ వద్ద ఉన్న ప్రయాణికులకు మజ్జిగను అందజేశారు. పాత్రికేయులు చలివేంద్రం ఏర్పాటు చేయడంతో వారి సేవానిరతిని కలెక్టర్ అభినందించారు. అనంతరం కమిషనర్ అరుణ మాట్లాడుతూ నిత్యం వార్తల సేకరణలో బిజీగా ఉండే పాత్రికేయులు ఇలాంటి సేవా కార్యక్రమాలు చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు, ఏపీయూడబ్ల్యూజే జిల్లా కన్వీనర్ లోకనాథన్, ప్రెస్‌క్లబ్ కార్యదర్శి అశోక్ కుమార్, ఉపాధ్యక్షుడు మహేష్, సంయుక్త కార్యదర్శి షకీల్ అబి, కార్యవర్గ సభ్యులు దొరస్వామి, చంద్ర, అయ్యప్ప, సీనియర్ పాత్రికేయులు వీరరాఘవులు, రమేష్ బాబు, మూర్తి, శివప్రసాద్, చంద్ర, నవీన్, బాలు, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

22న ఇంటర్వ్యూలు

చిత్తూరు కార్పొరేషన్: తపాలాశాఖలో జీవిత బీమా, గ్రామీణ జీవిత బీమాలో ఏజెంట్ల నియామకం కోసం ఈనెల 22న ఇంటర్వ్యూ నిర్వహించనున్నట్లు ఆ శాఖ సీనియర్ సూపరింటెండెంట్ చెన్నకేశవులు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇందుకు 18–50 ఏళ్లలోపు వయసు ఉండి, పది, ఇంటర్ పాసైన వారు అర్హులన్నారు. అభ్యర్థులు 22న చిత్తూరులోని ప్రధాన తపాలా కార్యాలయంలో ఇంటర్వ్యూలకు హాజరు కావాలని కోరారు.

24 మందిపై కేసు నమోదు

పాలసముద్రం : అనుమతి లేకుండా ర్యాలీ, నిరసన కార్యక్రమాలు చేపట్టిన 24 మంది టీడీపీ నాయకులపై కేసు నమోదు చేశామని ఇన్‌చార్జ్ ఎస్‌ఐ షెక్షావలి తెలిపారు. గురువారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ మండలకేంద్రంలోని టీడీపీ కార్యాలయం నుంచి ఆ పార్టీ నాయకులు బుధవారం పోలీస్‌స్టేషన్ వరకు అనుమతి లేకుండా ర్యాలీ చేపట్టి, అనంతరం స్టేషన్ ఎదుట నిరసన చేపట్టడంతో వారిపై కేసు నమోదు చేశామన్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ర్యాలీలు, నిరసనలు చేపట్టాలంటే ముందస్తుగా అనుమతి తీసుకోవాలని, కానీ టీడీపీ నాయకులు, కార్యకర్తలు అనుమతి లేకుండానే ర్యాలీలు, నిరసనలు చేపట్టారన్నారు. అందువల్ల నిబంధనలకు విరుద్ధంగా ర్యాలీ, నిరసన చేపట్టిన వారిపై కేసు నమోదు చేశామన్నారు.

అప్రమత్తంగా ఉండండి

రామకుప్పం: మండల పరిధిలోని అటవీ గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అడవిల్లోకి వెళ్లకూడదని డీఆర్‌ఓ చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. సరిహద్దు రాష్ట్రమైన తమిళనాడు అటవీప్రాంతం నుంచి ఏనుగుల గుంపు ఆంధ్రా సరిహద్దు ప్రాంతానికి చేరువైనట్లు సమాచారం అందిందన్నారు. కౌండిన్య అభయారణ్యంలోకి ఏనుగుల గుంపు ప్రవేశించే అవకాశం ఎక్కువగా ఉన్నట్లు ట్రాకర్లు తెలిపారన్నారు. ననియాల, వీర్నమల, పంద్యాలమడుగు అటవీగ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. రాత్రివేళల్లో అటవీమార్గంలో ఒంటరిగా ప్రయాణం చేయకూడదన్నారు. ఏనుగులు కనబడితే వెంటనే అటవీ అధికారులకు సమాచారం ఇవ్వాలని ఆయన కోరారు.

శ్రీవారి దర్శనానికి 18 గంటలు

తిరుమల: తిరుమలలో గురువారం భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 12 కంపార్టుమెంట్లు నిండాయి. బుధవారం అర్ధరాత్రి వరకు 61,510 మంది స్వామివారిని దర్శించుకున్నారు. 29,399 మంది తలనీలాలు సమర్పించుకున్నారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.59 కోట్లు భక్తులు సమర్పించారు. టైం స్లాట్ టిక్కెట్లు కలిగిన వారికి సకాలంలోనే దర్శనం లభిస్తోంది. దర్శన టిక్కెట్లు లేని వారికి 18 గంటల సమయం పడుతోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన వారు 2 గంటల్లో స్వామిని దర్శించుకోగలుగుతున్నారు.

నేడు డయల్ యువర్ ఈఓ

తిరుమల : శుక్రవారం ఉదయం 9 నుంచి 10 గంటల వరకు తిరుమల అన్నమయ్య భవనంలో డయల్ యువర్ ఈవో కార్యక్రమం జరుగనుంది. ఈ సందర్భంగా భక్తులు తమ సందేహాలను, సూచనలను టీటీడీ ఈవో ఏవీ ధర్మారెడ్డికి ఫోన్ ద్వారా మాట్లాడి తెలుపవచ్చు. ఇందుకు భక్తులు సంప్రదించవలసిన నెంబరు 0877-2263261. ఈ కార్యక్రమాన్ని శ్రీ వేంకటేశ్వర భక్తి చానల్ ప్రత్యక్ష ప్రసారం చేయనుంది.

బాలల బలగం!

బాల భవిత కేంద్రం చిన్నారుల భవితకు అండగా నిలుస్తోంది. పుట్టుకతోనే లోపాలు వస్తే అనారోగ్య సమస్యలను ప్రాథమిక దశలోనే గుర్తించి భరోసా కల్పిస్తోంది. ఆరోగ్య విషయంలో సమస్యలు గుర్తించి ఉచిత వైద్యం చేస్తూ వెన్నుదన్నుగా నిలుస్తోంది. థెరపీలు చేయిస్తూ శారీర సమస్యల నుంచి విముక్తి కలిగిస్తోంది. కాస్త మెరుగుపడ్డాక ఇతరత్రా ఆస్పత్రుల్లో ఆరోగ్య శ్రీద్వారా ఆపరేషన్లు చేయిస్తూ.. చిన్నారుల ఆరోగ్యానికి బలగంగా నిలుస్తోంది. డీఈఐసీల్లో అందే సేవలు.. సత్ఫలితాలపై 'సాక్షి' ప్రత్యేక కథనం..

▸▸ బైరెడ్డిపల్లికి చెందిన వినయ్ వంకర కాళ్లుతో పుట్టాడు. వెంటనే చిన్నారిని డాక్టర్ల సూచనల మేరకు తల్లిదండ్రులు చిత్తూరు డీఈఐసీ (జిల్లా బాల భవిత కేంద్రం)కి తీసుకొచ్చారు. అప్పటి నుంచి రెండేళ్ల పాటు చికిత్స అందించారు. తర్వాత పిండికట్టు వేయించారు. చిన్న థెరపీ చేయించారు. ఇప్పుడు మంచి ఫలితాలొచ్చాయని వైద్యులు, చిన్నారి తల్లిదండ్రులు చెబుతున్నారు.

▸▸ చిత్తూరుకు చెందిన రితీకా పుట్టిన వెంటనే పక్షవాతానికి గురైంది. ఏడాది నుంచి చిత్తూరు డీఈఐసీలో థెరపీ చేయించుకున్నారు. మూడేళ్లుగా డాక్టర్ల సూచనలు, సలహాలు తీసుకున్నారు. మెరుగైన చికిత్స అందడంతో పక్షవాతం నుంచి ఆ బాలిక కోలుకుంది. ఇప్పుడు పాఠశాలకు వెళ్లి చదువుకుంటోంది.



▸▸ పీలేరుకు చెందిన ఓ బాలుడు వినికిడి సమస్యతో పుట్టాడు. చిత్తూరు కేంద్రం ద్వారా ఆ బాలుడికి కొన్నాళ్లుగా చికిత్స అందిస్తూ వచ్చారు. కాస్త మెరుగైన చికిత్స అందడంతో ఆరోగ్యశ్రీ ద్వారా గుంటూరులోని ఓ ఆస్పత్రిలో కాక్లియర్‌ప్లాంటేషన్ చేయించారు. ఇందుకు ప్రభుత్వం రూ.6 లక్షలు ఖర్చు చేసింది.

▸▸ గుంటూరు జిల్లా, వెంకటచింతల మండలానికి చెందిన కమలరావ్ (15) గుండె సంబంధిత జబ్బుతో బాధపడుతున్నాడు. తల్లిదండ్రులు అతని కోసం ప్రైవేటు ఆస్పత్రుల్లో లక్షలు ఖర్చుపెట్టారు. తీరా తిరుపతిలోని డీఈఐసీని 2020ని ఆశ్రయించారు. 15 రోజుల పాటు బాలుడిని అక్కడి డాక్టర్లు పర్యవేక్షణలో ఉంచి ఆరోగ్యశ్రీ ద్వారా పద్మావతి హృదయాలయంలో ఆపరేషన్ చేయించారు. ఇప్పుడు బాలుడు స్కూల్‌కు వెళుతున్నాడు.



చిత్తూరు కేంద్రంలో స్పెషల్ ఎడ్యుకేటర్ స్పీచ్ థెరపీ

- చిన్నారులకు అండగా జిల్లా బాల భవిత కేంద్రం
- పుట్టిన బిడ్డ నుంచి 18 ఏళ్లలోపు పిల్లలకు ఉచిత సేవలు
- కేంద్రాల్లో థెరపీ.. సత్ఫలితాలిస్తున్న వైనం
- ఆరోగ్యశ్రీ ద్వారా విలువైన ఆపరేషన్లు

సాక్షి, తిరుపతి డెస్క్: చిత్తూరు జిల్లా కేంద్రం, తిరుపతి రుయా ఆస్పత్రి ఆవరణలోని డీఈఐసీ(జిల్లా బాల భవిత కేంద్రం)ల్లో 0–18 ఏళ్ల లోపు పిల్లల ఆరోగ్య సమస్యలకు ముందస్తు చికిత్స అందిస్తున్నారు. పుట్టుకతో వచ్చే పోషకాహార లోపం, బాల్యంలో వచ్చే వ్యాధులు, వైకల్యంతో కూడిన లోపాలకు చికిత్స చేస్తున్నారు. మానసికంగా సరిగా లేని పిల్లలకు, దృష్టి, వినికిడి లోపం ఉన్న పిల్లలకు ఇక్కడ చికిత్స చేస్తారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా నలుమూలల నుంచి నిత్యం ఈ కేంద్రాలకు 80 నుంచి 120 మంది పిల్లలు వస్తుంటారు. బుద్ధి మాంద్యానికి వైద్య సేవలందించడంతో పాటు శారీరక వికలత్వ నివారణకు ఈ కేంద్రాలు తోడ్పాటందిస్తున్నాయని తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

వైకల్యం, లోపాలు ఇలా

అటిజన్, దృష్టి, వినికిడి సమస్యలు, నాడీ చలన సమస్యలు, నడక ఆలస్యం, జ్ఞానపరంగా అభివృద్ధి ఆలస్యం, మాటలు ఆలస్యం, అభ్యసనా సమస్యలు, చురుకుదనం లోపం తదితర వాటికి చికిత్స అందిస్తారు. వీటిన్నంటికీ థియరీ చికిత్సలు చేస్తారు. ఈ కేంద్రాల్లో నెలకు వందల సంఖ్యలో ఓపీలు వస్తుంటాయి. ప్రతి సోమ, శుక్రవారాల్లో స్క్రీనింగ్ క్యాంపు నిర్వహిస్తారు. అలాగే కళ్లు, వినికిడి సమస్యలపై దృష్టిపెట్టి మెరుగైన వైద్యసేవలందిస్తారు. చర్మం, చెవుల్లో చీము, వాపు, రుమాటిక్ గుండె, శ్వాసకోశ సంబంధిత వ్యాధులు, మూర్ఛ, దంతాలు, చిగుళ్ల వ్యాధులకు చికిత్స అందిస్తారు.

సేవలు ఇలా..

అప్పుడే పుట్టిన బిడ్డ నుంచి 18 ఏళ్లలోపు పిల్లల వరకు లోపాలను డీఈఐసీలో గుర్తిస్తారు. పుట్టుకతోవచ్చే నాడీ వ్యవస్థ లోపం, డౌన్ సింద్రోమ్, వంకర పాదాలు, గ్రహణ మొర్రి, పెదవి అంగిట్లో చీలిక, వినికిడి లోపం, స్పీచ్ థెరపీ, నెలలు నిండని పిల్లలు, గ్లకోమా సెంద్రియా, మైక్రోసియా, అతుక్కున్న వేళ్లు, కేటరాక్ట్‌లోపం, గుండె జబ్బులు, నడుంభాగం అభివృద్ధి లోపాలను గుర్తించి చికిత్స అందిస్తున్నారు. రక్తహీనత, అయోడిన్ లోపం, రిక్కెట్స్, రేచీకటి లాంటి తీవ్రపోషకాహార లోపాలకు సేవలందిస్తారు. ఈ క్రమంలో అత్యాధునిక పరికరాలను కూడా కేంద్రాల్లో అందుబాటులో ఉంచారు. ఇక్కడ పరీక్షల ఆధారంగా ఆరోగ్యశ్రీ ద్వారా గుంటూరు, తిరుపతిలోని ఆస్పత్రుల్లో అవసరమైన వారికి ఆపరేషన్లు చేస్తున్నారు. గుంటూరులో కాక్లియర్‌ప్లాంటేషన్ చేయిస్తున్నారు. ఇందుకు ఆరోగ్య శ్రీద్వారా రూ.6 లక్షల వరకు వెచ్చిస్తున్నారు. గత రెండేళ్ల కాలంలో ఈ కేంద్రం ద్వారా 27 మందికి ఆపరేషన్ చేయించినట్టు వైద్యులు తెలిపారు. అలాగే తిరుపతిలో 260 మంది పిల్లలకు గుండె సంబంధిత ఆపరేషన్లు చేయించగా.. ఒక్కో ఆపరేషన్‌కు రూ.2 లక్షల నుంచి రూ.5 లక్షలకు వరకు ఆరోగ్యశ్రీ ద్వారా ఖర్చుచేశారు. వంకర పాదాలు ఉన్న పిల్లలకు ఇప్పటి వరకు 305 మందికి ఆపరేషన్ చేయించగా.. ఒక్కొక్కరికి రూ.50 వేల నుంచి రూ.లక్ష వరకు ప్రభుత్వం ఖర్చు చేసింది. మూడేళ్ల కాలంలో 12 వేల మంది ఈ కేంద్రాలను ఆశ్రయించగా.. ఐదువేల మంది పిల్లలు రికవరీ అయినట్టు వైద్యులు చెబుతున్నారు.



చిత్తూరులో జిల్లా బాల భవిత కేంద్రంలో ఫిజియో థెరపీచేస్తున్న డాక్టర్



తిరుపతి కేంద్రంలో పిల్లలకు ఫిజియోథెరపీ



తిరుపతి కేంద్రంలో పిల్లలకు ఫిజియోథెరపీ

కేంద్రంలో ఎవరెరుంటారంటే..

ఈ కేంద్రంలో చిన్న పిల్లల వైద్యులు, మెడికల్ ఆఫీసర్, డెంటల్ డాక్టర్, సైక్రాటిస్ట్, ఫిజియోథెరపిస్ట్, ఆడియాలజిస్ట్, కంటి వైద్యులు, ఎర్లీ ఇంటర్వెంటనిస్ట్ (స్పీచ్, స్పెషల్ ఎడ్యుకేషన్), సోషల్ వర్కర్, ఇద్దరు స్టాఫ్‌నర్సులు, ఒక ల్యాబ్ టెక్నీషియన్, మేనేజర్లు ఉంటారు.

డీఈఐసీ వెన్నుముఖలాంటింది



రోజుల బిడ్డ నుంచి 18 ఏళ్ల లోపు పిల్లలకు కేంద్రంలో వైద్యం చేస్తాం. అన్ని రకాల డాక్టర్లు ఉన్నారు. ఫిజియోథెరపీ, స్పీచ్ థెరపీ, ఆడియాలజిస్ట్ సేవలు ఈ మూడూ డీఈఐసీకి వెన్నుముఖ లాంటివి. ఈ రకమైన వైద్యం కోసం ఎక్కువగా బైరెడ్డిపల్లి, కుప్పం, హిందూపురం, వీ.కోట, తిరుపతి నుంచి వస్తున్నారు. వారందరికీ కూడా నిత్యం అందుబాటులో ఉంటూ సేవలందిస్తున్నాం.

–విజయలక్ష్మి, ఫిజియోథెరపిస్ట్, చిత్తూరు

డాక్టర్లు వెంటనే స్పందిస్తున్నారు




మాది సత్యసాయి జిల్లా, ముత్యాలయ్యవారిపల్లి. మా సోదరుడి పిల్లలు ప్రత్యూష (07), హేమ సాగర్ (16)కు పుట్టుకతోనే వినికిడిలోపం, మాటలు రావు. ఇన్నాళ్లు మదనపల్లె ఆస్పత్రిలో చికిత్స చేయిస్తున్నాం. మూడు రోజుల క్రితం చిత్తూరుకు రెఫర్ చేశారు. ఇక్కడి డాక్టర్లు వెంటనే స్పందించారు. పిల్లలకు అన్ని పరీక్షలు చేశారు. చికిత్సకు సంబంధించి అర్థమయ్యే రీతిలో చెప్పారు.

–రమణ, సత్యసాయి జిల్లా

సగౌరవంగా అభ్యున్నతి

సారా తయారీనే జీవనాధారమై ఏళ్ల తరబడి బట్టీల మాటున మగ్గిపోయిన వారి జీవితాలు నేడు ఆనందంగా ఉంటున్నాయి.. సారా కాల్చే కుండల్లో నీరు ఆవిరైనట్లు గమ్యం లేకుండా సాగుతున్న వారి కుటుంబాలు నేడు సమాజంలో తలెత్తుకుని సగౌరవంగా జీవిస్తున్నాయి.. సారా కాచేటప్పుడు ఎవరొస్తారో.. ఏం చేస్తారో అనే భయం మాటున బతికిన వారు ఇప్పుడు తమ బిడ్డల భవిష్యత్‌కు బంగారు బాటలు వేసుకుంటున్నారు.. ప్రభుత్వం అందించిన ఉన్నతి పథకం వారికి వరంలా మారింది.

- సారా తయారీ వృత్తిని వదిలి గౌరవప్రదమైన జీవితం
- 42 కుటుంబాల వారికి ఉన్నతిపథకం ద్వారా రూ.50 వేల వడ్డీలేని రుణాలు
- ఆవులు, గొర్రెలు పెంచుకుంటూ మెరుగైన జీవనం
- వెలుగులు నింపుతున్న రాష్ట్రప్రభుత్వం



పరివర్తన చెందిన లబ్ధిదారులకు నగదు చెక్ పంపిణీ చేస్తున్న ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి, పీడీ తులసి

సాక్షి, చిత్తూరు: గతంలో నాటు సారా తయారీనే వారి దినచర్యగా పెట్టుకున్న వారి జీవితాల్లో మార్పు తేవాలని, వారికి సమాజంలో గౌరవ మర్యాదలు ఉండాలన్న రాష్ట్రప్రభుత్వం సంకల్పం ఫలిస్తోంది. వారికి ఉపాధి అవకాశాలు కల్పించి వారి జీవితాలకు ప్రభుత్వం చుక్కానిలా నిలిచింది. ఉన్నతి పథకం ద్వారా ఒక్కో కుటుంబానికి రూ.50 వేల వడ్డీలేని రుణాన్ని అందించి ఆర్థికంగా ఆదుకుంటోంది. నాడు సారా తయారీనే వృత్తిగా బతికిన వారు ఇప్పుడు తమ సొంతూరులోనే ఆవులు, గొర్రెలు పెంచుతూ సకుటంబ సమేతంగా హాయిగా సంఘంలో గౌరవప్రదమైన జీవనం సాగిస్తున్నారు. ఇలా పరివర్తన చెందిన వారికి రాష్ట్ర ప్రభుత్వం లక్షలాది రూపాయలు ఆర్థిక సాయాన్ని అందజేసి ఆదుకుంటోంది.

టీడీపీ పాలనలో విచ్చలవిడిగా సారా...!

నాటి టీడీపీ ప్రభుత్వ పాలనలో ఉమ్మడి చిత్తూరు జిల్లాలో సారా ఏరులై పారింది. కానీ అప్పటి ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోలేదు. పల్లెవాసులు, బడుగులు ఎందరో ఈ సారా కోరల్లో చిక్కుకుని బలయ్యారు. అయితే 2019లో రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సారా కట్టడికి కఠిన ఆంక్షలు విధించింది. ఎక్సైజ్, పోలీసుశాఖలతో పాటు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో శాఖను రంగంలోకి దించి సారా తయారీని చాలావరకు నియంత్రించింది.

42 కుటుంబాల్లో మార్పు..

చిత్తూరు జిల్లా కార్వేటినగరం పంచాయతీ పరిధిలోని దళితవాడకు చెందిన పలువురు సారా తయారు చేసి అక్రమంగా అమ్ముకుంటూ జీవనం సాగించేవారు. ఈ క్రమంలో అదే నియోజకవర్గానికి చెందిన రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఎక్సైజ్ శాఖ మంత్రి కె.నారాయణస్వామి సారా కట్టడికి చర్యలు చేపట్టారు. చిత్తూరు జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ తులసి, ఇతర అధికారులతో కలసి పలుమార్లు ఆ గ్రామస్తులతో చర్చించి వారికి చట్టాల గురించి వివరించి చైతన్య పరిచారు. ప్రభుత్వం ద్వారా వారికి రుణాలు అందించడంతో ఇప్పుడు వారు చిన్న చిన్న వ్యాపారాలు, ఆవులు, మేకలు, గొర్రెలు కొనుగోలు చేసుకుని మెరుగైన జీవనం సాగిస్తున్నారు.

ఆర్థిక సహాయం అందించాం..



కార్వేటినగరం దళితవాడలోని పేదల కుటుంబంలో మార్పు తీసుకురావాలన్న ఆశయాన్ని నెరవేర్చాలని భావించాం. ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి ఆధ్వర్యంలో పలుమార్లు ఆ గ్రామస్తులకు సారా వల్ల కలిగే అనర్థాల గురించి వివరించి చైతన్యపరిచాం. వారికి రుణాలు మంజూరు చేయడంతో ఆవులు, గొర్రెలు, మేకలు కొనుగోలు చేసి వాటిని మేపుకుంటూ చక్కటి జీవితాన్ని గడుపుతున్నారు.

– తులసి, పీడీ, జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ

మెరుగైన జీవితానికి నాంది..



2023–24 సంవత్సరానికి గానూ ఎస్సీ, ఎస్టీ (యానాది), ఇతర అర్హత కలిగిన వారు తమ జీవనోపాధి పెంపొందించుకోవడానికి రూ.లక్ష నుంచి రూ.5 లక్షల వరకు వడ్డీ లేని రుణాలను ప్రభుత్వం ఉన్నతి పథకం ద్వారా అందజేస్తుంది. గతంలో ఒకరికి రూ.50 వేలు రుణాలు మంజూరు చేసే వారు. కానీ ఈ సంవత్సరం ఆ వడ్డీ లేని రుణాలు పెంచడం జరిగింది. అర్హులు ఈ ఉన్నతి పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

– షణ్మోహన్, చిత్తూరు జిల్లా కలెక్టర్

సంతృప్తికరంగా జీవిస్తున్నాం..

గతంలో దుర్భర జీవితాన్ని గడుపుతూ అనేక కష్టాలు పడ్డాం. అందుకే కష్టపడి బతకాలని నిర్ణయించుకున్నాం. అయితే మాకు అప్పు ఇచ్చే వారు కరువయ్యారు. ఇలాంటి పరిస్థితుల్లో డీఆర్‌డీఏ ద్వారా ఉన్నతి పథకం ద్వారా వడ్డీ లేకుండా ప్రభుత్వం రూ.50 వేలు రుణం ఇచ్చింది. ఆ డబ్బుతో ఆవును కొనుక్కుని, పాలు అమ్ముకుంటూ సంఘంలో గౌరవంగా జీవిస్తున్నాం.

– అమ్ములు (పేరు మార్చాము), కార్వేటినగరం హరిజనవాడ

జీవితాన్ని చక్క పెట్టుకున్నాం..

సారా తయారు చేసే మా జీవితాలు ఎటుపోతాయో అనే భయం, మాతో పాటు పిల్లల భవిష్యత్ దుర్భరం అవుతోందన్న బాధ ఉండేది. ఈ పరిస్థితుల్లో డీఆర్‌డీఏ ఉన్నతి పథకం మాలాంటి వారికి భరోసా ఇచ్చింది. వడ్డీ లేకుండా ఇచ్చిన రూ.50 వేల రుణం ఇచ్చారు. ఈ డబ్బుతో మేకలు కొని వాటిని మేపుకుంటూ ప్రశాంతంగా జీవిస్తున్నాం.

– శాంతమ్మ (పేరుమార్చాము), కార్వేటినగరం హరిజనవాడ

ప్రభుత్వానికి ధన్యవాదాలు..

మేము చాలా ఏళ్లుగా సారా కాచే వృత్తిపైనే ఆధారపడి బతికేవాళ్లం. దీంతో అనేక సమస్యలను ఎదుర్కొన్నాం. వీటి నుంచి బయట పడాలనుకున్న మాకు ప్రభుత్వం మాకు ఆర్థిక సాయం అందించింది. ఆ డబ్బులతో మేకలు కొనుగోలు చేసి వాటిని మేపుతూ హాయిగా జీవిస్తున్నాం. జగనన్న ప్రభుత్వానికి ధన్యవాదాలు.

– రాములమ్మ (పేరు మార్చాము), కార్వేటినగరం హరిజనవాడ

మామిడి కోతలపై అవగాహన కల్పించండి

- విడతల వారీగా కాయలు కోసేలా రైతులకు వివరించండి
- జిల్లా ఉద్యానవన శాఖ డీడీ మధుసూదన్‌రెడ్డి



మాట్లాడుతున్న ఉద్యానశాఖ డీడీ మధుసూదన్‌రెడ్డి

చిత్తూరు అగ్రికల్చర్: జిల్లాలో అధిక విస్తీర్ణంలో సాగవుతున్న మామిడిని దిగుబడి చేసే సమయం ఆసన్నమైందని, పక్వానికి వచ్చిన కాయలను మాత్రమే విడతల వారీగా కోయాలని జిల్లా ఉద్యానవన శాఖ డీడీ మధుసూదన్‌రెడ్డి తెలిపారు. గురువారం స్థానిక మ్యాంగో భవనంలో ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో సచివాలయాల్లోని ఉద్యానశాఖ సిబ్బందికి మామిడి దిగుబడిపై అవగాహన సదస్సు నిర్వహించారు. జిల్లాలో తోతాపురి రకం 42,204 హెక్టార్లలో సాగులో ఉందన్నారు. ఉమ్మడి జిల్లా పరిధిలో 39 గుజ్జు పరిశ్రమలు ఉండగా, అందులో 30 పరిశ్రమలు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ఉన్నాయన్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రస్తుతం కిలో రూ.19 చొప్పున మామిడి ధరను ప్రకటించడం జరిగిందన్నారు. దీనిపై గ్రామీణ రైతులకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించి, ఉన్న పంటను ఒకేసారి దిగుబడి చేయకుండా పక్వానికి వచ్చిన కాయలను విడతల వారీగా దిగుబడి చేసి గుజ్జు పరిశ్రమలకు తరలించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ర్యాంపుల వద్ద రైతులకు ఇబ్బంది కలగకుండా ఎప్పటికప్పుడు పర్యవేక్షణ ఏర్పాటు చేశామన్నారు. జిల్లా వ్యవసాయశాఖ అధికారి మురళీకృష్ణ మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో పంటను పరిశీలించి మామిడి దిగుబడిపై రైతులకు సచివాలయ సిబ్బంది మార్కెట్, వ్యవసాయ శాఖ అధికారులు, సిబ్బంది సమన్వయంతో పని చేసి సూచనలు ఇవ్వాలన్నారు. సదస్సులో శాస్త్రవేత్తలు నాగవేణి, రాఘవేంద్ర, మార్కెటింగ్ శాఖ ఏడీ పరమేష్ తదితరులు పాల్గొన్నారు.

వీఆర్వోపై దౌర్జన్యం

పలమనేరు: మండలంలోని జంగాలపల్లి శ్మశానం వద్ద సర్వేయర్, సిబ్బందితో కలసి వీఆర్వో గోవిందయ్య సర్వే చేస్తున్నారు. అదే సమయంలో గ్రామానికి చెందిన అమరనాథ్ అనే వ్యక్తి అక్కడికి వచ్చి సర్వే చేయకూడదంటూ అభ్యంతరం తెలిపి, ఇది తమ పట్టాభూమి అని రెవెన్యూ సిబ్బందితో వాదించాడు. అయితే రికార్డుల్లో శ్మశానంగా ఉందని వీఆర్వో తెలపడంతో అతన్ని దుర్భాషలాడుతూ దౌర్జన్యం చేశాడు. దీనిపై బాధితుడు స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వారు విచారిస్తున్నారు.

పౌష్టికాహార పంపిణీలో లోపాలుంటే సహించం



అంగన్‌వాడీ కేంద్రంలోని పిల్లలతో మంత్రి ఉషశ్రీ చరణ్

రేణిగుంట: అంగన్‌వాడీ సెంటర్లలో పిల్లలు, గర్భిణులు, బాలింతలకు అందించే పౌష్టికాహారం పంపిణీలో లోపాలుంటే సహించమని రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి ఉషశ్రీ చరణ్ స్పష్టం చేశారు. ఆమె రేణిగుంటలోని బుగ్గవీధిలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రం ప్రీస్కూల్‌ను గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పలు రికార్డులను పరిశీలించి పిల్లల్లో ఆంగ్ల భాష ప్రావీణ్యాన్ని పరీక్షించారు. పిల్లలకు అందించే కోడిగుడ్లు సైజు తక్కువగా ఉండడం, కొన్ని కోడిగుడ్లు మీద స్టాంపు ముద్రలు లేకపోవడంపై అంగన్‌వాడీ టీచర్ ధనమ్మను ప్రశ్నించారు. పాలు సక్రమంగా సరఫరా చేయడం లేదన్న ఫిర్యాదుపై విచారించి నివేదికను అందించాలని పీడీ జయలక్ష్మిని ఆదేశించారు. తమకు సెంటర్‌కు రావడం కష్టంగా ఉందని గర్భిణులు, బాలింతలు చెప్పగా జూన్ నుంచి ఇంటి వద్దకే పంపించేలా చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం ఆమె పౌష్టికాహారాన్ని రుచి చూసి సంతృప్తి వ్యక్తంచేశారు. సీడీపీఓలు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

క్లుప్తంగా

గుర్తు తెలియని మహిళ శవం లభ్యం



సోమల: అవులపల్లె సమీపంలోని గుండు బావిలో తేలాడుతున్న మహిళ మృతదేహం

సోమల: మండలంలోని అవులపల్లె పంచాయతీ మఠం వడ్డిపల్లె సమీపంలోని పంట పొలాల మధ్య గల గుండు బావిలో తేలాడుతున్న గుర్తు తెలియని మహిళ మృతదేహాన్ని గురువారం కనుగొన్నారు. గ్రామస్తుల సమాచారంతో సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు బావిలో గల మృతదేహాన్ని పరిశీలించి ఆత్మహత్య లేదా ఎవరైన చంపి పడేశారన్న కోణంలో దర్యాప్తు చేస్తున్నారు. పూర్తి వివరాలు పోలీసుల విచారణలో తెలియాల్సి ఉంది.

గాయపడిన వ్యక్తి మృతి

తవణంపల్లె: మండలంలోని దిగువ మోదల పల్లె దగ్గర మార్చి 29వ తేదీన ట్రాక్టర్ ఢీకొన్న ప్రమాదంలో గాయపడిన వ్యక్తి తిరుపతి రుయా హాస్పిటల్లో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందినట్లు ఎస్ఐ సుధాకర్ రెడ్డి తెలిపారు. కొత్తగొల్లపల్లెకు చెందిన దేవేంద్ర, తరుణ్‌యాదవ్ స్కూటర్‌పై వెళ్తుండగా ట్రాక్టర్ ఢీకొంది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన దేవేంద్ర రుయా హాస్పిటల్లో చికిత్స పొందుతూ మృతి చెందాడు.

ఐటీఐ అడ్మిషన్లకు దరఖాస్తు చేసుకోండి

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ యాజమాన్యాల ఐటీఐ కళాశాలల్లో అడ్మిషన్లకు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా ఐటీఐ కళాశాలల కన్వీనర్ రవీంద్రరెడ్డి తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ 2023–24 విద్యా సంవత్సరంలో ఐటీఐ చదవాలనుకునే విద్యార్థులు www.iti.ap.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. జూన్ 6వ తేదీలోపు అర్హత, ఆసక్తి ఉన్న విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవాలని తెలిపారు. ఇతర వివరాలకు 9502264707 నంబర్‌లో సంప్రదించాలని ఆయన కోరారు.

చిత్తూరులో జాతరకు వేళాయే..!



నడివీధి ఏర్పాటు పనుల పరిశీలనలో డీఎస్పీ శ్రీనివాసమూర్తి



కొంగారెడ్డిపల్లిలో జాతర ఏర్పాట్లు

- ఈ నెల 16, 17 తేదీల్లో గంగ జాతర
- వారం రోజులుగా నడివీధిలో శరవేగంగా ఏర్పాట్లు
- కొంగారెడ్డిపల్లి, సంతపేట, గిరింపేట ప్రాంతాల్లో కూడా జాతర మరూ
- ఏర్పాట్లను పరిశీలించిన డీఎస్పీ శ్రీనివాసమూర్తి

చిత్తూరుఅర్బన్/చిత్తూరు రూరల్: చిత్తూరులో గంగ జాతరకు వేళ అయింది. ఈ నెల 16, 17 తేదీల్లో గంగజాతర నిర్వహించేందుకు నిర్వాహకులు ఖరారు చేశారు. అందులో భాగంగా మంగళవారం రాత్రి చాటింపు ప్రక్రియను పూర్తి చేశారు. శుక్రవారం పొంగళ్ల పొట్టి అమ్మవారికి శాంతిపూజలు చేయనున్నారు. జాతర ముహూర్తం దగ్గర పడడంతో మండపాల ఏర్పాటు పనులు శరవేగంగా సాగుతున్నాయి. గతవారం రోజులుగా ఏర్పాటు పనులను జాతర నిర్వాహకులు పగడ్బందీగా భారీస్థాయిలో ఏర్పాట్లు చేస్తున్నారు. నడివీధిలో అమ్మవారిని కొలువుదీర్చే ప్రాంతంలో మండపం ఏర్పాటు చేయడంతో పాటు భక్తుల రద్దీ దృష్ట్యా మండపం అనుకుని భారీస్థాయిలో పందిరి వేయిస్తున్నారు. అలాగే భక్తులకు ఇబ్బందులు లేకుండా క్యూలైన్లను చకచకా ఏర్పాటు చేస్తున్నారు. మండపం పైభాగంలో వివిధ రకాల వస్త్రాలతో అలంకరిస్తున్నారు. నడివీధి దారి పొడవునా జాతర పనులు చురుగ్గా సాగుతుండడంతో చిత్తూరులో జాతర సందడి నెలకొంది.

మరిన్ని చోట్ల..

కొంగారెడ్డిపల్లి ప్రాంతంలో కూడా భారీగా ఏర్పాట్లు జరుగుతున్నాయి. మండపం ఏర్పాటుతో పాటు విద్యుత్ దీపాలంకరణ, ప్రత్యేక ఆకర్షణ కోసం భారీగా కటౌట్‌లు కడుతున్నారు. అలాగే సంతపేటలో కూడా మండపం పెద్దస్థాయిలో ఏర్పాటవుతోంది. గిరింపేట, మురకంబట్టు, దొడ్డిపల్లి తదితర ప్రాంతాల్లో కూడా జాతర పనుల్లో వేగం పుంజుకుంది. సోమవారం సాయంత్రం కల్లా ఏర్పాట్లు పూర్తి చేయాలని జాతర పెద్దలు తీర్మానించారు.

అడ్వాన్స్ బుకింగ్‌లు..

పందిరి వేసే దగ్గర నుంచి అమ్మవారి నిమజ్జన ఏర్పాట్లు వరకు ముందస్తు బుకింగ్‌లు అవుతున్నాయి. సాంస్కృతిక కార్యక్రమాలు, వీధినాటకాలు, అమ్మవారి గజమాల, మండపం అలంకరణ, విద్యుత్ దీపాలంకరణ, డప్పు వాయిద్యాలు ఇతరత్రా వాటిని ముందస్తు బుకింగ్ చేసుకుంటారు. ఓంశక్తి భక్తులు దీక్షలు కూడా ప్రారంభమయ్యాయి. దీంతో జాతర సందడి నెలకొంది. ఖర్చులకు వెనకడుగు వేయకుండా జాతర నిర్వాహకులు గంగమ్మను ప్రత్యేక ఆకర్షణగా నిలబెట్టేందుకు చూస్తున్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు, డప్పు వాయిద్యాల ఖర్చులకు కూడా వెనకడుగు వేయడం లేదు. వేలాదిమందికి అన్నదానం చేయాలని నిర్ణయం తీసుకున్నారు.

ఏర్పాట్ల పరిశీలన..

చిత్తూరు నగరంలో వచ్చేవారం నిర్వహించనున్న గంగ జాతరకు సంబంధించి భద్రత ఏర్పాట్లను పోలీసులు, అధికారులు పరిశీలించారు. చిత్తూరు డీఎస్పీ శ్రీనివాసమూర్తి స్థానిక సీఐలు మద్దయ్య ఆచారి, భాస్కర్‌తో కలిసి నడివీధి, సంతపేట, గిరింపేట ప్రాంతాల్లో జరుగుతున్న జాతర ఏర్పాటు పనులను పరిశీలించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేయాలని నిర్వాహకులకు సూచించారు.

సంక్షేమ క్యాలెండర్ చాలా బాగుంది

చిత్తూరు కలెక్టరేట్ : సంక్షేమ క్యాలెండర్ చాలా బాగుందని రాష్ట్ర అటవీ, విద్యుత్, పర్యావరణ శాస్త్ర సాంకేతిక భూగర్భ గనుల శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తెలిపారు. గురువారం ఆయన రాష్ట్ర సమాచార పౌర సంబంధాల శాఖ ఆధ్వర్యంలో ముద్రించి జిల్లాకు పంపిణీ చేసిన ప్రభుత్వ సంక్షేమ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అన్ని వర్గాల ప్రజలకు మేలు చేకూరుస్తున్నట్లు తెలిపారు. సంక్షేమ క్యాలెండర్ వారీగా ఏటా ప్రభుత్వం, ఇచ్చిన మాట ప్రకారం పథకాలను ప్రజలకు అందజేస్తోందన్నారు. కార్యక్రమంలో జిల్లా సమాచార, పౌరసంబంధాల శాఖ డీడీ పద్మజ, జెడ్పీ సీఈఓ ప్రభాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సంక్షేమ క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

విజయవాడకు వినాయకుని ప్రచార రథం



కాణిపాకంలో ప్రచార రథానికి పూజలు చేస్తున్న ఈఓ వెంకటేశు, వేదపండితులు

కాణిపాకం(యాదమరి): కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయక స్వామి ప్రచార రథం ప్రత్యేక పూజల అనంతరం విజయవాడకు బయలుదేరింది. గురువారం మధ్యాహ్నం ఆలయం వద్ద స్వామివారి ప్రచార రథానికి ఈఓ వెంకటేశు, ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి సాగనంపారు. అనంతరం ఈఓ మాట్లాడుతు విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో శుక్రవారం నుంచి ఆరు రోజుల పాటు అష్టోత్తర శత కుండాత్మకచండీ, రుద్ర రాజశ్యామల సుదర్శన సహిత శ్రీ లక్ష్మీ మహాయజ్ఞంలో స్వామివారి ప్రచార రథం ఉంటుందన్నారు. భక్తులు స్వామివారిని దర్శించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏఈఓ రవీంద్రబాబు, సూపరింటెండెంట్ కోదండపాణి, వేదపండితులు తదితరులు పాల్గొన్నారు.

ఈతకెళ్లి గల్లంతైన బాలుడు



రూపేష్(ఫైల్)

తొట్టంబేడు(రేణిగుంట): ఈతకు వెళ్లి ఓ బాలుడు గల్లంతైన ఘటన మండలంలోని గురుకులపాళెంలో గురువారం విషాదాన్ని నింపింది. గ్రామానికి చెందిన రూపేష్(13), ప్రసాద్(12), ఉదయ్(13) ముగ్గురూ స్నేహితులు. సమీపంలోని తెలుగుగంగ కాలువలో ఈత నేర్చుకోవడానికి వెళ్లారు. ముందుగా ఉదయ్, రుపేష్ నీటిలో దిగారు. అయితే నీటి ప్రవాహం ఎక్కువగా ఉండడంతో దిగిన వెంటనే రుపేష్ నీటిలో మునిపోయాడు. దీంతో ఉదయ్ కేకలు వేయగా సమీపంలోని వారు ఉదయ్‌ను రక్షించారు. భయాందోళనతో ప్రసాద్ గట్టుపై ఉండిపోయాడు. గల్లంతైన రూపేష్ కోసం బంధువులతో పాటు స్థానికులు, పోలీసులు, రెవెన్యూ అధికారులు గాలింపు చర్యలు చేపట్టారు. దీనిపై తహసీల్దార్ సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ ఈత రాని వారు అప్రమత్తంగా ఉండాలని, ఆయా గ్రామాల్లో వీఆర్‌ఓలు, స్థానిక ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు.

డ్రగ్స్ వాడడం లేదని డిక్లరేషన్ ఇవ్వండి

- ప్రతి కళాశాల యాజమాన్యం డిక్లరేషన్ తప్పనిసరిగా ఇవ్వాలి
- కళాశాలలు ప్రారంభం కాగానే విద్యార్థులకు అవగాహన కల్పించండి
- డ్రగ్స్ రహిత జిల్లాగా మార్చేందుకు చర్యలు
- పకడ్బందీగా విద్యాకానుక కిట్లు పంపిణీ చేయండి
- కలెక్టర్ షణ్మోహన్ వెల్లడి



మాట్లాడుతున్న కలెక్టర్ షణ్మోహన్, పక్కన జేసీ పులి శ్రీనివాసులు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లావ్యాప్తంగా కళాశాలల్లో విద్యార్థులు డ్రగ్స్ వాడడం లేదని ఆయా కళాశాలల యాజమాన్యాలు కచ్చితంగా డిక్లరేషన్లు ఇవ్వాలని కలెక్టర్ షణ్మోహన్ ఆదేశించారు. గురువారం ఆయన కలెక్టరేట్‌లో పలు శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఇంటర్మీడియట్ అధికారుల సమీక్షలో కలెక్టర్ మాట్లాడుతూ డ్రగ్స్ రహిత జిల్లాగా మార్చేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. ప్రతి కళాశాల ప్రిన్సిపల్ తమ కళాశాలలో విద్యార్థులు మాదకద్రవ్యాలు వాడడం లేదని డిక్లరేషన్ కచ్చితంగా ఇవ్వాలన్నారు. 2023–24 సంవత్సరానికి జిల్లాలోని ప్రైవేట్, కార్పొరేట్ కళాశాల గుర్తింపు కొనసాగింపునకు ప్రభుత్వం ప్రత్యేక కమిటీని నియమించిందన్నారు. ఆ కమిటీ ఆధ్వర్యంలో ప్రతి కళాశాలలో ముమ్మర తనిఖీలు ఉంటాయని చెప్పారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలలు పున:ప్రారంభం కాగానే డ్రగ్స్ వాడకం వల్ల కలిగే అనర్థాలపై విద్యార్థులకు అవగాహన కల్పించాలన్నారు. జిల్లాలోని 98 కళాశాలల్లో ఈ కార్యక్రమం అమలుకు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. త్వరలో ఇంటర్మీడియట్ ప్రిన్సిపల్స్‌తో సమావేశం నిర్వహించేలా చర్యలు చేపట్టాలన్నారు. ప్రైవేటు జూనియర్ కళాశాలల గుర్తింపు కోసం ఏర్పాటైన త్రిసభ్య కమిటీ అన్ని కళాశాలలను పరిశీలించి నివేదికలు అందజేయాలని ఆదేశించారు. సమావేశంలో ఇంటర్మీడియట్ ఆర్ఐఓ రమేష్, డీవైఈఓ దయానందరాజు, జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి పెద్దిరెడ్డి, తదితర అధికారులు పాల్గొన్నారు.

స్కూళ్లు తెరిచిన రోజే విద్యాకానుక

జిల్లావ్యాప్తంగా పాఠశాలలు పున: ప్రారంభం అయిన రోజే జగనన్న విద్యాకానుక కిట్లను పంపిణీ చేయాలని కలెక్టర్ షణ్మోహన్ ఆదేశించారు. గురువారం ఆయన జిల్లాకేంద్రంలోని లిటిల్ ఫ్లవర్ పాఠశాలలో భద్రపరిచిన విద్యాకానుక కిట్లను కలెక్టర్ తనిఖీ చేసి వివరాలు అడిగి తెలుసుకున్నారు. జగనన్న విద్యాకానుక కిట్లను జిల్లావ్యాప్తంగా అన్ని ప్రభుత్వ స్కూళ్లలోని విద్యార్థులకు ఎక్కడా పొరపాట్లకు తావు లేకుండా పగడ్బందీగా పంపిణీ చేయాలని డీవైఈఓ చంద్రశేఖర్‌ను ఆదేశించారు. కార్యక్రమంలో ఎంఈఓ సెల్వరాజ్ పాల్గొన్నారు.

వేగవంతంగా రీసర్వే..

జిల్లావ్యాప్తంగా భూ రీసర్వే కార్యక్రమం చేపడుతున్నట్లు కలెక్టర్ షణ్మోహన్ సీసీఎల్ఏ స్పెషల్ చీఫ్ సెక్రటరీ సాయిప్రసాద్‌కు వివరించారు. రీసర్వే పురోగతిపై సీసీఎల్ఏ గురువారం రాష్ట్ర కార్యాలయం నుంచి కలెక్టర్, జేసీలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు, భూరక్ష పథకం జిల్లాలో మొదటి విడతగా 134 గ్రామాల్లో సర్వే పూర్తయినట్లు తెలిపారు. ఆ గ్రామాలలో సర్వే రాళ్లను నాటిస్తున్నామని, ఈ నెల 15లోపు ఆ ప్రక్రియ కూడా పూర్తి చేస్తామన్నారు. అలాగే 90 శాతం రైతులకు భూహక్కు పత్రాలను కూడా పంపిణీ చేశామన్నారు. రెండో విడత రీసర్వే చేపట్టిన 100 గ్రామాల్లో 34 గ్రామాలకు 13 నోటిఫికేషన్ ఇచ్చామన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ పులి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ఐటీఐల్లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి ఎడ్యుకేషన్ : తిరుపతి జిల్లా పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐ కళాశాలల్లో ప్రవేశాలకు ఈనెల 10నుంచి జూన్ 6వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని తిరుచానూరు రోడ్డు, పద్మావతీపురంలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్, కన్వీనర్ వి.శ్రీలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు ''ఐటీఐ.ఏపీ.ఎన్ఐసి.ఇన్'' వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్లో దరఖాస్తు చేసుకోవా లని సూచించారు. పూర్తి వివరాలకు 94928 61369, 92937 41997, 77996 79351 నంబర్లలో సంప్రదించాలని ఆమె కోరారు.

వైఎస్సార్‌సీపీలోకి వలసల జోరు



వైఎస్సార్‌సీపీలో చేరిన వారికి పార్టీ కండువాలు కప్పుతున్న ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి

- టీడీపీ, బీజేపీ నుంచి పార్టీలో చేరిక

తొట్టంబేడు(రేణిగుంట): మండలంలోని పూడి గ్రామానికి చెందిన బీజేపీ, టీడీపీకి చెందిన నాయకులు, కార్యకర్తలు గురువారం ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో గురువారం గ్రామానికి చెందిన బీజేపీ వార్డు మెంబర్ జగదీష్, నేతాజీ, లక్ష్మీపతి, బాలరాజు, మహేష్, వెంకటేష్, రాజేష్, గిరి, యుగంధర్, వెంకటేష్, నాని, వెంకటమ్మ, సబ్బువల్లి, రేణుకమ్మ, సుబ్బమ్మ తదితరులు పార్టీలో చేరగా, వారికి ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి, మండల ఇన్‌చార్జి బియ్యపు పవిత్రారెడ్డి కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలుచేస్తున్న నవరత్నాల పథకాలను చూసి ఆకర్షితులమై వైఎస్సార్‌సీపీలో చేరుతున్నట్లు వారు స్పష్టంచేశారు. రానున్న ఎన్నికల్లో మరోసారి వైఎస్సార్‌సీపీ విజయానికి తమవంతు కృషిచేస్తామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో చెరుకు నరసింహనాయుడు, వడ్లతాంగళ్ బాలాజీరెడ్డి, మురళీయాదవ్, గురవయ్య, రామచంద్రయ్య, సురేష్, నాగరాజు, గోవర్ధన్ పాల్గొన్నారు.

యువకుడి అరెస్టు

వరదయ్యపాళెం: ఇన్ స్టాగామ్‌లో పరిచయం చేసుకుని ఓ బాలిక(14)ను మాయమాటలతో వంచించి, పరారైన ఓ యువకుడిపై పోక్సో కేసు నమోదు చేసి, అరెస్టు చేసినట్లు ఎస్ఐ నాగార్జున్‌రెడ్డి తెలిపారు. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. ఏర్పేడుకు చెందిన కుమార్ బీఎన్‌కండ్రిగ మండలం, గాజులపెళ్లూరులో తన బంధువుల ఇంటి వద్ద ఉంటూ, బీఎన్‌కండ్రిగకు చెందిన 8వ తరగతి చదువుతున్న బాలికను ఇన్ స్టాగామ్ ద్వారా పరిచయం చేసుకున్నాడు. వరదయ్యపాళెం గ్రామ పంచాయతీ గోపాలరావు కాలనీలోని తన అక్క ఇంటికి సెలవుల నిమిత్తం వచ్చిన బాలికను ఈ నెల 6వ తేదీన రాత్రి అపహరించి పరారయ్యాడు. బాధితుల ఫిర్యాదు మేరకు పోక్సో కేసు నమోదు చేసిన ఎస్ఐ నాగార్జున్‌రెడ్డి, సిబ్బందితో కలిసి గాలించి, గురువారం అరెస్టు చేశారు. ప్రేమ పేరుతో బాలికలను వంచిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ హెచ్చరించారు.

అవిలాల జాతరకు వచ్చి... తొండవాడలో శవమై..!



తొండవాడ బస్టాప్‌లో నారాయణ ఆచారి మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

తిరుపతి రూరల్: తిరుపతి బైరాగిపట్టెడ ఎంకేనాయుడు కాలనీకి చెందిన నారాయణ ఆచారి(65) మంగళవారం సాయంత్రం అవిలాల జాతరకు వెళ్తున్నానని ఇంట్లో చెప్పి వచ్చాడు. అయితే రెండు రోజులుగా అతను ఇంటికి రాకపోవడంతో బంధువుల వద్దకు వెళ్లాడని కుటుంబ సభ్యులు భావించారు. అయితే గురువారం సాయంత్రం చంద్రగిరి మండలం, తొండవాడ బస్టాప్‌లో ఓ వ్యక్తి మృతి చెందినట్లు స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. ముందుగా గుర్తుతెలియన వ్యక్తిగా భావించారు. సోషల్ మీడియాలో ఫొటోలు రావడంతో నారాయణ ఆచారి కుటుంబ సభ్యులు గుర్తించారు. జాతరకు వెళ్తున్నానని చెప్పి ఊరు కాని ఊరు వచ్చి శవమై పోయావా... అంటూ కన్నీరుమున్నీరుగా విలపించారు. నారాయణ ఆచారి మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగించినట్లు చంద్రగిరి సీఐ ఓబులేసు తెలిపారు.